క్లుప్తంగా

ఇంటర్మీడియెట్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మోడల్ స్కూల్లో 2024–25 సంవత్సరానికి గాను ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లలో ప్రవేశాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సి.పద్మజ తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 28వ తేదీ నుంచి మే 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150లు, ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200లు రుసుము చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాన్ని నూజెండ్ల మోడల్ స్కూల్లో అందించాలన్నారు. మెరిట్, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ప్రవేశాలు ఉంటాయన్నారు. ఆడపిల్లలకు ఉచిత హాస్టల్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు.

నేడు కోదండ రామాలయానికి భూమి పూజ

నాదెండ్ల: సాతులూరు గ్రామ పరిధిలోని గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి పక్కనే వడియరాజుల కాలనీలో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న కోదండరామస్వామి ఆలయానికి భూమి పూజ నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు భూమిపూజ జరగనుంది. గతంలో ఈ దేవాలయం పల్లంగా ఉండటం, వర్షాకాలంలో నీరు చేరుతుండటంతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు.

కస్తూర్బాగాంధీలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆరోతరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ మాధవీలత తెలిపారు. 7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్లను కూడా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైందని, ఏప్రియల్ 11వ తేదీ లోగా అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి ప్రాధాన్యత మండల పరిధిలోని విద్యార్థులు, అనాథలు, బడిబయట ఉన్న చిన్నారులకు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల బాలికలకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపికైన వారికి రిజర్వేషన్ల వారీగా సీట్లు కేటాయిస్తారన్నారు.

సీఆర్‌లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో ఇంటర్, డిగ్రీలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెన్నుపాటి చైతన్య తెలిపారు. నేరుగా దరఖాస్తులు కళాశాలలో అందజేయవచ్చన్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, తెలుగు ఇంగ్లిష్ మీడియాలలో, డిగ్రీలో బీఎస్సీ, బీకాం, బీఏల్లో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. విద్యార్థులకు చదువుతో పాటూ అన్ని రంగాల్లో శిక్షణ ఇస్తామని, సువిశాల ఆటస్థలం, క్రీడల్లో ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు.

నేడు తిరునాళ్ల

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు శివారు గ్రామం అద్దంకి బ్రాంచ్ కెనాల్ సమీపాన వేంచేసియున్న లక్ష్మి తిరుపతమ్మ సమేత గోపయ్య స్వాములు వారి తిరునాళ్ల వేడుకలు గురువారం ఘనంగా జరుపుతున్నట్లు ఆలయ ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు సహకారంతో ప్రతి ఏటా తిరునాళ్ల వేడుకలు వైభవంగా జరుపుతున్నామన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

నరసరావుపేట: పట్టణంలోని జమిందారు పంక్షన్‌హాలులో గురువారం సాయంత్రం ఐదుగంటలకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం పేర్కొన్నారు. కావున నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట రూరల్: వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ తెలిపారు. మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న కారణంగా తాగునీటి సరఫరాపై మాత్రం చర్చించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాషా, ఎంపీడీవో రవికాంత్, ఈవోపీఆర్‌డీ విజయకుమార్, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మెకానిక్ మృతి

వినుకొండ: ఆర్టీసీ బస్సు ఢీకొని ఆర్టీసీ మెకానిక్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం గిద్దలూరు నుంచి విజయవాడ వెళు తున్న ఆర్టీసీ బస్సు వినుకొండ డిపోలోకి వచ్చే క్రమంలో డిపోలో పనిచేస్తున్న గ్యారేజీ మెకానిక్ సుభాని (55) టీ తాగేందుకు బయటకు వస్తున్న సమయంలో బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో మెకానిక్ సుభాని తలపై నుంచి బస్సు వెళ్లడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పదికి బైబై..



సంవత్సర కాలంగా పుస్తకాలతో కుస్తీలు పట్టిన చేతులకు ఇవాళ స్వేచ్ఛ వచ్చింది. విద్యార్థి జీవితంలో అత్యంత ప్రధానమైన పదవ తరగతి పరీక్షలు పూర్తయ్యాయి. ఇన్నాళ్ల కఠోర శ్రమకు బుధవారం జరిగిన ఆఖరి పరీక్షతో విముక్తి లభించడంతో వారంతా పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చి విజయసంకేతం చూపించారు. ఈ దృశ్యాన్ని సాక్షి ఇలా కెమెరాలో క్లిక్‌మనిపించింది. సంవత్సరకాలంగా ఎక్కువ భాగం చదువుకే కేటాయించిన చిత్రంలోని విద్యార్థులు ఇక వచ్చే విద్యాభ్యాసంపై దృష్టి సారించనున్నారు. –శావల్యాపురం

పాహిమాం.. మహంకాళీ

ఇస్సప్పాలెంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి 49వ తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా బుధవారం అమ్మవారికి పొంగళ్ల సమర్పణను పెద్దఎత్తున నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పొంగళ్లు పొంగించి మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. శైవాగమ పండితులు యనమండ్ర సత్యసీతారామ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు కొత్తలంక రుద్రవీర కాళికా సత్య కార్తికేయ, నండూరి కాళీకృష్ణలు పూజాదికాలు నిర్వహించారు. –నరసరావుపేట రూరల్



నియమావళి పట్టదా?



మండలంలోని రావిపాడు ప్రధానరోడ్డులో ఏర్పాటుచేసిన స్వాగతద్వారానికి పసుపు రంగులు దర్శనమిస్తున్నాయి. దీనిపై నందమూరి తారక రామారావు రహదారి అని రాశారు. అలాగే గ్రామంలోని సెంటర్ డివైడర్స్‌లో ఏర్పాటు చేసిన వీధి దీపాలను కూడా పసుపు రంగులో ఏర్పాటు చేశారు. దీంతో పాటు గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఖాళీస్థలంలో తాటి ఆకులతో పందిరి వేసి దీనిని పసుపురంగు క్లాత్‌తో చుట్టారు. చీరాల– హైదరాబాద్ జాతీయరహదారి పక్కనే దీన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అధికారులు వీటిని పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి –నరసరావుపేట రూరల్

అభివృద్ధికి కేరాఫ్ వడ్లమూడివారిపాలెం

- పరుగులు తీసిన అభివృద్ధి, సంక్షేమం
- ఇంటింటికీ చేరిన జగనన్న సంక్షేమ ఫలాలు

అభివృద్ధి చేస్తామని గత ఎన్నికల వేళ జగనన్న సారథ్యంలోని వైఎస్సార్ సీపీ హామీ ఇచ్చింది. చెప్పినట్లుగానే దాన్ని అమలు చేసి చూపించింది. 'పాలకులు అంటే ఇలా ఉండాలి.. పాలన అంటే ఇలా ఉంటుంది' అని అందరూ మెచ్చుకునేలా జగనన్న పరిపాలనలో అభివృద్ధి చెందిన గ్రామం వడ్లమూడివారిపాలెం. గ్రామానికి ఏం కావాలి – గ్రామస్తుల అవసరాలేమిటో వాటినే గుర్తించి అమలు చేసి చూపారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలకులు.



గ్రామ సచివాలయ భవనం



నాడు - నేడు లో అభివృద్ధి చేసిన పాఠశాల



సీసీ రోడ్లు

ఇది కదా.. అభివృద్ధి

రొంపిచర్ల: వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో వడ్లమూడివారిపాలెం గ్రామంలో రూ.8,17,67,736 రూపాయలతో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో దూసుకుపోతోంది. 650 గృహాలు ఉన్న ఈ గ్రామంలో 1932 మంది జనాభా ఉన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని గ్రామానికి కనీస అవసరాలైన రోడ్లు, డ్రెయినేజ్, పాఠశాలల అభివృద్ధిలో ముందుంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డి పాలన చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పథకాలన్నీ ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా అందుతున్నాయి. సంక్షేమ పథకాలు అందుకోవడంలో ఎలాంటి మధ్యవర్తిత్వాలు లేకుండా సచివాలయం, వలంటీర్లతో డీబీటీ పద్ధతిలో పథకాలన్నీ చేరుతున్నాయి. అలాగే నిత్యావసర సరుకులు కూడా ఇంటివద్దకే వచ్చి ప్రజలకు అందజేయడం ఆనందంగా ఉందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పథకాలు ఇలా..

- 323 మందికి వైఎస్సార్ పెన్షన్ కానుక కింద రూ.2,25,67,750 లు.
- అమ్మఒడి పథకం కింద 193 మందికి రూ.71,62,000లు
- 314 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.1,08,16,500లు
- జగనన్నా విద్యాదీవెన, వసతిదీవెన కింద 42 మందికి రూ.13.42.625లు
- వైఎస్సార్ సున్నా వడ్డీలో భాగంగా 555 మందికి రూ.8,46,463లు
- ఈబీసీ నేస్తం పథకంలో 82 మందికి రూ.12,30,000లు
- వైఎస్సార్ చేయూత పథకంలో 86 మందికి రూ.48,56,200లు
- జగనన్నా తోడులో 55 మందికి రూ.5,50,000లు
- వైఎస్సార్ ఆసరా పథకంలో 355 మందికి రూ.34,58,240లు
- వ్యవసాయ యాంత్రీకరణ సామగ్రి రూ.15,00,000లు
- వైఎస్సార్ బీమా, వైఎస్సార్ వాహన మిత్ర పథకాల అమలుకు రూ.6,60,000లు

అభివృద్ధి పనులు ఇలా...

- రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ నిర్మాణం.
- నాడు–నేడులో భాగంగా రూ.62 లక్షల రూపాయలతో పాఠశాల అభివృద్ధి.
- రూ.15 లక్షలతో ఎస్టీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం.
- రూ.21 లక్షలతో ఆర్‌బీకే నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- రూ.18 లక్షలతో విలేజ్ క్లినిక్ భవన నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు.
- రూ.40 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజ్‌లు నిర్మాణం.
- రూ. 10 లక్షలతో చర్చి కాంపౌండ్ వాల్ నిర్మాణం.
- రూ.62 లక్షలతో పేదలకు ఇళ్ల స్థలాలు.

అడిగి మరీ ఇస్తున్నారు



ఎవరికి ఏం అవసరమో ఇంటికి వచ్చి అడిగి అవసరాలు తీరుస్తున్నారు. ముఖ్యంగా మాకాలనీలో చిన్న శుభకార్యం జరుపుకోవాలన్నా ఇబ్బందులు పడేవాళ్లం. కమ్యూనిటీ హాల్ కావాలని శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని అడిగాం. అంతే రూ.15 లక్షలతో హాలు నిర్మాణం చేయించారు. అడగకుండానే అవసరాలు తీరుస్తూ, అడిగిన పనులను వెంటనే పూర్తి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన మా పిల్లల తరానికి కూడా ఉండాలని మనసారా కోరుకుంటున్నా. – పొట్లూరి అల్లూరయ్య, గ్రామస్తుడు

మౌలిక వసతులొచ్చాయి



గ్రామానికి అవసరమైన మౌలిక వసతులను కల్పించటంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుంది. అవసరమైన వసతులను కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళగానే శరవేగంగా నిధులు మంజూరు చేయిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నారు. సంక్షేమ పథకాల అమలుతో గ్రామంలో వారంతా సంతోషంగా ఉన్నారు. అభివృద్ధిలో కూడా గ్రామం ముందుంది. గ్రామా అభివృద్ధికి అవసరమైన వసతులు కల్పించటంలో చొరవ చూపిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు. – గానుగపంట ఉత్తమ్‌రెడ్డి, సర్పంచ్

కూటమి కుట్రలు భగ్నం చేద్దాం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు
- కట్టుబడివారిపాలెంలో నాయకులతో ఆత్మీయభేటీ



కావటి మనోహర్‌నాయుడును సత్కరిస్తున్న పార్టీ నాయకులు

చిలకలూరిపేట: స్వార్థ ప్రయోజనాల కోసం కూటమి కట్టిన వారి కుట్రలు భగ్నం చేద్దాం... నిరంతరం ప్రజా సంక్షేమానికి పాటు పడుతున్న జగనన్న ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తెచ్చుకుందామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు పిలుపు నిచ్చారు. మండలంలోని కట్టుబడివారిపాలెం గ్రామంలో ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పట్ల తనకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని చెప్పారు. అదే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 600 కు పైగా హామీలు ఇచ్చిన చంద్రబాబు అనంతరం హామీలకు తిలోదకాలు పలికి, ఆన్‌లైన్ నుంచి మేనిఫెస్టోను మాయం చేసిన ఘనుడని ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికల్లో జనసేన, బీజేపీతో జట్టుకట్టిన చంద్రబాబునాయుడు చేసిన మోసాలను ప్రజలు మరిచిపోలేదని పేర్కొన్నారు. వ్యవసాయ, డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ చేస్తానని చెప్పి మోసగించిన విషయాన్ని రైతులు, మహిళలు మరిచిపోరాదని వెల్లడించారు. నాడు మోసం చేసిన కూటమితోనే జట్టుకట్టి చంద్రబాబు మళ్లీ వస్తున్న విషయం గుర్తించి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశానికి వచ్చిన మనోహర్ నాయుడుకు పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, పార్టీ మండల అధ్యక్షుడు గుత్తా యాములయ్య, గ్రామ సర్పంచ్ ముత్యాల రామారావు, నాయకులు మాగం వెంకటేశ్వర్లు, జయకృష్ణ, బొమ్మసాని పిచ్చయ్య, ఉయ్యాల కోటయ్య, కె.వీరరాఘవయ్య, నాగిశెట్టి సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టికుప్పలకు పరిష్కారం చూపిన కమిషనర్

ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టిన మున్సిపల్ కమిషనర్



మట్టి, మెటీరియల్‌ను తొలగిస్తున్న పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

నరసరావుపేట: పురపాలక సంఘం పరిధిలో గత కొన్నేళ్లుగా వివిధ ప్రాంతాల్లో పేరుకుపోయి ఉన్న బిల్డింగ్ మెటీరియల్, పెద్ద మట్టి కుప్పలను గుర్తించి వాటిని తొలగించేందుకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను చేపట్టారు. దీనికోసం ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. బుధవారం పాత పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న, వరవకట్ట న్యూ ఆంధ్ర యూపీ స్కూల్ వెనుక వైపు ఉన్నటువంటి బిల్డింగ్ మెటీరియల్, మట్టి కుప్పలను జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. దీనిని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పర్యవేక్షించారు. తమ ఇళ్ల ముందు ఉన్న కంకర, ఇటుక రాళ్లు బిల్డింగ్ మెటీరియల్స్, ఇతర భవన నిర్మాణానికి సంబంధించిన వస్తువులు రోడ్లపై కుప్పలకుప్పలుగా ఏవైనా ఉంటే వాటిని తొలగించుకోవాలని ఆయా యజమానులకు సూచించారు. లేకుంటే పురపాలక సంఘం తరపున ఏర్పాటు చేసినటువంటి వాహనాల ద్వారా వాటి అన్నిటిని తీసుకెళ్లడం జరుగుతుందని తెలియజేశారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రామకోటయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్ షాపులో విజిలెన్స్ తనిఖీలు

నరసరావుపేట రూరల్: పట్టణంలోని శ్రీ వెంకట తిరుమల ఫర్టిలైజర్స్ షాపులో బుధవారం రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయశాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేపట్టాయి. వ్యవసాయ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా రికార్డులు రాయకుండా ఫెర్టిలైజర్స్–పెస్టిసైడ్స్ విక్రయిస్తున్నారనే సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహించారు. రెండు కంపెనీలకు చెందిన ఏడురకాల ఉత్పత్తులకు ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్ లేనందున షాపులో రూ.4.42 లక్షల విలువైన 112 లీటర్ల పురుగు మందులు అమ్మకాలను నిలుపుదల చేశారు. తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి కె.రమణకుమార్, సబ్ ఇనస్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

సుపరిపాలనకు అర్థం చెప్పింది జగనన్నే

- ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్
- 30న నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు

చిలకలూరిపేట: సుపరిపాలన అంటే ఇలా ఉండాలని ఆచరించి చూపిన వ్యక్తి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు ఎన్నికల కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన ఐదు సంవత్సరాలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు నిరాజనం పలుకుతున్నారని తెలిపారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన పట్టణంలోని ఎస్ఎంఎస్ గార్డెన్స్ ముస్లిం షాదీఖానాలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చిట్టా విజయభాస్కర రెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ కమిటీ చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్ పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

డీఎస్పీ సత్యనారాయణ వర్మ



పెట్లూరివారిపాలెంలో సీఆర్‌పీఎఫ్ కవాతులో పాల్గొన్న డీఎస్పీ వర్మ, సీఐ మల్లికార్జున, ఎస్‌ఐలు

నరసరావుపేట రూరల్: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ సత్యనారాయణ వర్మ తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం గ్రామాలలో బుధవారం సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వర్మ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. దీని ప్రకారం రాత్రి 10 గంటల లోపు అన్ని దుకాణాలు మూసివేయాలన్నారు. రాత్రి 10 గంటల తరువాత అవసరమైన వారు మాత్రమే బయటకు రావాలని, అనవసరంగా బయట తిరిగినా, మద్యం సేవించినా వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బొల్లా

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ–భూసమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయం 10వ వార్షిక బ్రహ్మోత్సవాలు గ్రామస్తులు సౌజన్యంతో ఘనంగా ముగిసినట్లు ఆలయ పూజారి డి.వి.మారుతీరామచార్యులు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంటు సమన్వయకర్త (ఎంపీ అభ్యర్థి) డాక్టరు పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు–ఆదిలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతి–తిరుమల వేదపండితులు పరుచూరి హనుమంతాచార్యులు, రామకృష్ణచార్యులు, సాయిచార్యులు వేదమంత్రాలతో వసంతోత్సవం, స్నపన తిరుమంజనం, చూర్ణోత్సవం, చక్రస్నానం, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సారథ్యంలో స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గరుడ పల్లకిలో ట్రాక్టరులో మేళతాళాలతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీర్పేడి రత్నగిరి, ఎంపీపీ ముండ్లమూరి సుహాసినీ అనిల్ కుమార్, తూమాటి కబ్బారావు, ముంద్రు రాఘవరావు, స్వర్ణాల వెంకట్రావు, ముంద్రు సాంబశివరావు, సాదినేని చిన వెంకయ్య,గట్టుపల్లి వీరాస్వామి, సొసైటీ అధ్యక్షులు బొల్లా వెంకట సాంబశివరావు పాల్గొన్నారు.

నాలుగు ఆలయాల్లో హుండీ లెక్కింపు

యడ్లపాడు: మండలంలోని పలు ఆలయాల్లోని హుండీ లెక్కింపు ప్రక్రియను దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు బుధవారం నిర్వహించారు. మొత్తం నాలుగు దేవస్థానాల్లోనూ రూ.77,959 నగదును అధికారులు స్వాధీనం దేవదాయశాఖ బ్యాంక్ ఖాతాకు చేసినట్లు ఆశాఖ ఇన్స్పెక్టర్ మంజూష తెలిపారు. యడ్లపాడు శ్రీరణ వీరాంజనేయస్వామి ఆలయం ఏడాది కాలంలో భక్తుల ద్వారా వచ్చిన హుండీ ఆదాయం రూ.55,205, సొలస గ్రామంలోని శ్రీరంగ నాయకస్వామి ఆలయంలో ఏడాదికి రూ.10,468, కొండవీడు గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఏడాదికి రూ.6,144, అలాగే కొండవీడు కొండపై ఇటీవల పునరుద్ధరణ చేసిన పురాతన ఆలయం శ్రీలక్ష్మి నరసింహ స్వామి హుండీ కేవలం నెల రోజులకు రూ.6,142 ఆదాయం భక్తుల నుంచి లభించింది.